దాతలు ఆదుకున్నా ఆగిన ఊపిరి

చికిత్స పొందుతూ అనన్య మృతి



రాంగోపాల్‌పేట్: లివర్ పూర్తిగా ఫెయిలై ట్రాన్స్‌ప్లాంట్ కోసం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోండా కుమ్మరిగూడకు చెందిన అనన్య బుధవారం రాత్రి కన్ను మూసింది. సందిరి రాజ్‌కుమార్, సరితల ఆరేళ్ల అనన్య లివర్ ఫెయిల్ కావడంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంది. ఆమెకు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని దానికి రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఇంప్యాక్ట్ గురూ అనే స్వచ్ఛంద సంస్థ క్లౌడ్ ఫండింగ్ ద్వారా ఫండ్ రైజింగ్ చేపట్టింది. దేశ విదేశాల్లో ఉండే దాతలు స్పందించి సుమారు రూ.22 లక్షల మేరకు అందించారు. ఈ నెల 6వ తేదీన సాక్షిలో కూడా 'అనన్యను ఆదుకుందాం' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయకముందే ఆమె శరీరం వైద్యానికి సహకరించకపోవడంతో ఆ చిన్నారి ఊపిరి వదిలింది. గురువారం బంధువులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా వి.అవసారం మండలం, రాయకోడూర్ గ్రామానికి చెందిన అందె నాగకోటి జీవన్‌కుమార్ (27) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం నగరానికి వచ్చి ఎస్‌ఆర్‌నగర్ సమీపంలోని బాపూనగర్‌లో స్నేహితుడు అశోక్‌తో కలిసి ఉంటున్నాడు. తమ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చడంతో పాటు తేలిగ్గా డబ్బులు సంపాదించాలనే ఆత్యాశతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకుని మరో స్నేహితుడైన సత్యశ్రీ పనుస్కుకు విషయం చెప్పారు. ముగ్గురు కలిసి ఏపీలోని రాజమండ్రికి చెందిన ప్రవీణ్, నగరంలోని లింగంపల్లి రామచంద్రాపురంకు చెందిన మణితేజ అనే వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. గంజాయి తీసుకొచ్చి బాపూనగర్‌లో ఉంటున్న అద్దె గదిలో పెట్టి చిన్న చిన్న ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేసి జీవన్‌కుమార్, సత్యశ్రీ, అశోక్ అరెస్టు చేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



అడ్డగుట్ట: అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని మారేడుపల్లి మండల తహసీల్దార్ పద్మ సుందరి హెచ్చరించారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో ఖాళీగా ఉన్న నాలుగు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల తాళాలు పగులగొట్టి కొందరు అక్రమంగా ఉంటున్నారని పలువురు బస్తీ వాసులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వగా స్పందించిన ఆమె గురువారం నాలుగు ఇళ్లకు సీల్ వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మొత్తం 48 ఇళ్లలో గతంలో 44 అలాట్ చేశామని, మిగిలిన బ్లాక్–2 లోని 301, 303, బ్లాక్–3 లోని 302, బ్లాక్–5లోని 301 నాలుగు ఇళ్లను ఇంకా ఎవరికీ అలాట్ చేయలేదన్నారు. అందులో కొందరు అక్రమంగా ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు నాలుగు ఇళ్లను ఖాళీ చేయించినట్లు తెలిపారు. ఇళ్లు అలాట్ చేసే వరకు ఎవరూ లోపలికి వెళ్లరాదని హెచ్చరించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాధిక ఉన్నారు

ఉత్సాహంగా మెడిసినల్ ప్లాంట్స్ బయ్యర్స్ మీట్



మీట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

సనత్‌నగర్: కేరళ అటవీ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం బేగంపేటలోని హోటల్ హరితా ప్లాజాలో మెడిసినల్ ప్లాంట్స్ బయ్యర్స్ మీట్ ఉత్సాహంగా జరిగింది. దేశంలోని 11 రాష్ట్రాలతో పాటు నేపాల్‌కు చెందిన కొనుగోలుదారులు, ట్రేడర్స్, ఎగుమతిదారులు హాజరయ్యారు. ఔషధ మొక్కల కొనుగోలుదారులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల మధ్య చక్కటి వాణిజ్య బంధాన్ని నెలకొల్పేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. 24 రకాలకు చెందిన వివిధ ఔషధ మొక్కలను దేశంలోని 11 రాష్ట్రాలకు చెందిన రైతులు ఉత్పత్తి చేస్తున్నారన్నారు .రైతులకు మంచి గిట్టుబాటు ధరతో ఔషధ మొక్కల బయ్యర్ల సమస్యలు చర్చించి పరిష్కరించుకోవడం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఔషధ మొక్కల సంస్థ సీఈఓ సోనీ బాలాదేవి, అటవీ శాఖ ఐజీ త్రినాథ్‌కుమార్, జాతీయ ఔషధ మొక్కల సంస్థ మార్కెటింగ్ మేనేజర్ సౌరభ శర్మ, ఎన్ఎంసీబీ ప్రాజెక్ట్ రీజనల్ డైరెక్టర్ కేసీ చాకో పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేసే వారికే మా మద్దతు



మాట్లాడుతున్న శంకర్‌రావు

అడ్డగుట్ట: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను కొనసాగించిన వారికే మా ఓటు వేస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదురుగా మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం అమలు చేసే రాజకీయ పార్టీలకే రైల్వే కార్మికుల మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, అసిస్టెంట్ జీఎస్‌లు ఉదయ భాస్కర్, బారాటీ, రామకృష్ణ, జోనల్ కోశాధికారి సరోజిని రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్, నాయకులు వరప్రసాద్, ఖాజాబాబ, స్వామి పాల్గొన్నారు.

విహారయాత్రకు కిషన్ అగర్వాల్ దాతృత్వం



లాలాపేట: సికింద్రాబాద్‌కు చెందిన ఐరన్ మర్చంట్ కిషన్ అగర్వాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల తన దాతృత్వాన్ని చాటారు. లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గడి స్కూల్) విద్యార్థులకు ప్రత్యేకంగా 3 ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసి డోలారి ధనీ సందర్శనకు తీసుకెళ్లారు. అక్కడి ప్రవేశ టికెట్లతో పాటు అన్ని ఖర్చులు తానే భరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల కిషన్ అగర్వాల్ చూపిన ఆప్యాయత మరువలేనిదని ఉపాధ్యాయులు కొనియాడారు.

సురేందరుకు అలిశెట్టి పురస్కారం



లాలాపేట: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పగిడిపల్లి సురేందరు రాష్ట్రస్థాయి అలిశెట్టి పురస్కారం అందుకున్నారు. గురువారం శివసాయి రెసిడెన్సీ హాల్లో జగిత్యాల కళాశ్రీ సాహితి వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ అక్షర సూరీడు అలిశెట్టి ప్రభాకర్ 31వ జయంతి–వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలకు అలిశెట్టి రాష్ట్రస్థాయి పురస్కారాలు ప్రదానోత్సవంలో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా సురేందర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి రాజు, గుండేటి రాజు, మద్దెర సరోజన, అనిత పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి కూడలిలో స్తంభించిన ట్రాఫిక్



ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న నిర్మాణాలు

నిత్యం ట్రాఫిక్ చిక్కులే!

- ప్రమాదాలకు నిలయంగా సీతాఫల్‌మండి కూడలి
- ప్రతినిత్యం స్తంభిస్తున్న ట్రాఫిక్
- స్పందించని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కూడలి ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. ప్రయాణికులు, వాహనాల సంఖ్య పెరుగుతుండడం, రోడ్డు ఇరుకుగా ఉండడం కారణంతో ఈ కూడలి ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. దశాబ్దాల క్రితం రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా అమలుకు నోచుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 2016లో చిలకలగూడ–సీతాఫల్‌మండి, సీతాఫల్‌మండి–జామై ఉస్మానియా రహదారుల విస్తరణకు మరోమారు ప్రతిపాదనలు సిద్ధం చేసినా అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో కొత్త ప్రతిపాదనలు సైతం మూలనపడ్డాయి. రహదారి విస్తరణ పనులు పక్కన పెట్టి సీతాఫల్‌మండి చౌరస్తాలో అనుమతి లేని నిర్మాణాలను తొలగించి, ప్రమాదాలను నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాపార కేంద్రాలుగా ఫుట్‌పాత్‌లు..

సీతాఫల్‌మండి రహదారి విస్తరణలో భాగంగా తొలగించాల్సిన పలు భవనాలను అధికారులు ఐదేళ్ల క్రితమే గుర్తించారు. ఇక్కడి కూడలిలో ఒక వైపు ఎంపిక చేసిన భవనాలు తొలగించాల్సి ఉండగా వాటి పక్కన్నే మరిన్ని ఎలాంటి అనుమతులు లేని నిర్మాణాలు వెలిశాయి. తాత్కాలిక నిర్మాణాల మాటున వెలిసిన ఈ నిర్మాణాల్లో పలు వ్యాపారాలు వెలవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. రహదారిని విస్తరించాల్సిన స్థలంలో నిర్మాణాలు వెలువడడం, అందులోని వ్యాపారాల కోసం వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ కూడలిలోనే కాకుండా ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లే ఫ్లై ఓవర్ వంతెన పైనా వాహనాలు బారులు తీరుతున్నాయి. ఉదయం, సాయంత్రం విద్యార్థులను పాఠశాలలకు తోడుకుని వెళ్లడం ఇబ్బందిగా మారుతుందని వారి తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు..

సాంకేతిక సమస్యలకు పరిష్కారం లభించాక సీతాఫల్‌మండి విస్తరణ పనులు త్వరలో చేపడుతామని జీహెచ్ఎంసీ అధికారులు ఏళ్లతరబడి కాలం గడుపుతున్నారు. చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి మీదుగా జామై ఉస్మానియా వరకు 3.5 కిలో మీటర్ల మేర రహదారి విస్తరించాల్సి ఉంది. కొన్నింటిని పూర్తిగా, ఇంకొన్నింటిని పాక్షికంగా మొత్తంగా 567 భవనాల తొలగింపుకు ఐదేళ్ల క్రితం రెండవ విడత ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అధికారులు, పాలకులు విస్తరణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విస్తరణ పనులు ఇప్పట్లో జరిగే అవకాశాలు లేవు. దరిమిలా కనీసం కూడలినైనా విస్తరించి ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. భిప్రాయపడుతున్నారు.

పోలీసులు ప్రేక్షకపాత్ర....

చిలకలగూడ కూడలి మొదలు వారాసీగూడ, జామై ఉస్మానియా వరకు ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమించి వ్యాపారాలు వెలిశాయి. విస్తరణ జరగక ఇరుకుగా మారిన రహదారులపై వెలిసిన వ్యాపారాలను తొలగించడంలో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా చిలకలగూడ, సీతాఫల్‌మండి, నామాలగుండు, వారాసీగూడ, జామైఉస్మానియా కూడళ్లలోని ఫుట్‌పాత్‌లన్నీ వ్యాపారాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వెలిసిన వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, బాటసారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ నగరంగా తీర్చిదిద్దుదాం



ట్రాఫిక్ నిబంధనలపై పోస్టర్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: నగర ప్రజలు, వాహనదారుల సహకారంతో నగరాన్ని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో దేశంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నగర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 22 ఏళ్ల క్రితం తాను ట్రాఫిక్ డీసీపీగా పని చేసిన సమయంలో చేతనైనంత వరకు ప్రభుత్వం, సీనియర్ ఆఫీసర్లు, ప్రజలందరి సహకారంతో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేశానని ఇప్పుడు కూడా ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాల నివారణ కోసం విద్యార్థులు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిబంధనలు అతి క్రమించే వాళ్లు, మద్యం తాగి వాహనాలు నడిపే వాళ్లు, చట్టాన్ని అతిక్రమించి ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాల మీదకు తెచ్చే వాళ్లను ఏ మాత్రం వదలి పెట్టబోమన్నారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. 8, 9, 10వ తరగతి పాఠ్యాంశాల్లో ట్రాఫిక్‌ను ఒక పాఠ్యాంశంగా పెట్టేందుకు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి డీజీపీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. రవాణా శాఖ జాయింట్ కమిషనర్ రమేష్, డీసీపీ సుబ్బారాయుడు, అదనపు డీసీసీ రంగారావు, ఏసీపీలు మధుసూదన్‌రెడ్డి, టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే రిజర్వేషన్ల ఫలాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణతోనే అన్ని కులాలకు ఫలితాలు దక్కుతాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ అన్నారు. ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో జరిగిన మాదిగ విద్యార్థుల సదస్సుకు కొమ్ము శేఖర్ మాదిగ అధ్యక్షత వహించగా గోవింద నరేష్ పాల్గొని మాట్లాడారు.

- అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధికార ప్రతినిధిగా దినేష్, ప్రధాన కార్యదర్శులుగా నవీన్, రవితేజ, విష్ణు, ఉపాధ్యక్షులుగా సిద్ది శ్రీకాంత్, మంద తిరుపతి, ప్రవీణ్, రిషి, కార్యదర్శులుగా సింహాద్రి, దుర్గాప్రసాద్, అరుణ్, సహాయ కార్యదర్శులుగా నిఖిల్, కాశీ, రమేష్, ప్రచార కార్యదర్శులుగా జాన్, అశోక్, కోఆర్డినేటర్ సునీల్ గవస్కర్ నియమించారు.

అభినందన



సికింద్రాబాద్: సీతాఫల్‌మండికి చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ప్రవల్లికను ఎమ్మెల్యే టీ. పద్మారావుగౌడ్ అభినందించారు. పలు అంతరాష్ట్ర పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన ప్రవల్లిక సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ బాలికల పోటీలకు ఎంపికయ్యింది. బాల్యం నుంచే సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న ప్రవల్లిక ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో పంజాబ్‌లోని లవ్లీ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తోంది.

మా ఇళ్లకు రక్షణ కల్పించండి


రైల్వే ట్రాక్ వద్ద ఇందిరానగర్ వాసుల నిరసన



నిరసన తెలుపుతున్న ఇందిరానగర్ వాసులు

సికింద్రాబాద్: ఆర్ట్స్ కళాశాల రైల్వే స్టేషన్‌లో అదనపు రైల్వేలైన్ నిర్మాణం చేస్తున్న ఫలితంగా ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్నాయని ఇందిరానగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తలైన్ నిర్మాణంలో భాగంగా సమీపంలోని రెండు గృహాలు ధ్వంసమయ్యాయని స్థానికులు రైల్వేట్రాక్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైల్వే అధికారులు అదనపు లైన్ నిర్మాణ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ట్రాక్‌ను ఆవరించి ఉన్న తమ గృహాలకు ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీబాటలో భాగంగా కొద్ది రోజుల క్రితం ఈ ప్రాంతాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని రైల్వే అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ నిర్మాణం పనులు కొనసాగిస్తుండడంతో ఆగ్రహానికి గురైన స్థానికులు నిరసనకు దిగారు. స్పందించిన అధికారులు ఆర్ట్స్ కళాశాల రైల్వేస్టేషన్ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణం పనులు, ఇందిరానగర్ ప్రజలకు ఎదురవుతున్న ప్రమాదకర పరిస్థితులను అధ్యయనం చేసి రైల్వేట్రాక్‌కు సమాంతరంగా కాంక్రీట్ గోడను నిర్మించి ఇందిరానగర్ గృహాలవైపు మట్టి, రాళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



రసూల్‌పురా: జాతీయ రహదారి భద్రత వారోత్సవం పురస్కరించుకుని గురువారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తిరుమలగిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బోధీశ్రీ, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ సేఫ్టీ చైర్మన్ వినోద్‌కుమార్, రాష్ట్రపతి నిలయం పరిపాలన అధికారి రజనీప్రియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడేట్లకు రహదారి భద్రతా నియమాల గురించి వివరించారు.

అనుమతులు..ఆమోదాలు!

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్: ఫ్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దాదాపు నాలుగు నెలల సుదీర్ఘ విరామం అనంతరం కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం జరగనుంది. పెండింగ్ ప్రతిపాదనలు, త్వరలో పదవీ విరమణ పొందనున్న బోర్డు ఉన్నతాధికారుల స్థానాలను భర్తీ చేసేందుకు కిందిస్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లకు బోర్డు ఆమోదం తెలుపనుంది. భూగర్భ జలాల పరిరక్షణకు సంబంధించి రూపొందించిన నూతన నిబంధనలపై బోర్డులో చర్చించి తీర్మానం చేయనున్నారు. వీటికి తోడు సాధారణ పరిపాలనకు సంబంధించిన వివిధ ప్రతిపాదనలు, గత ఎమ్మెల్యే, దివంగత సాయన్న ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులకు సైతం బోర్డులో తీర్మానం చేసే అవకాశం ఉంది.

ఓఎస్‌గా యానీ, హెచ్‌ఎస్‌గా దేవేందర్

ఈ ఏడాది తొలి మూడు నెలల్లో కీలక విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులు పదవీ విరమణ చేయన్నారు. కంటోన్మెంట్ బోర్డు సర్వెంట్స్ రూల్స్‌కు అనుగుణంగా వారి స్థానాల్లో తదుపరి హోదాల్లో ఉన్న సీనియర్ అధికారులకు ప్రమోషన్ వర్తింపజేస్తారు. కేంద్ర సర్వీసులకు చెందిన సీఈఓ, డిప్యూటీ సీఈఓ, జాయింట్ సీఈఓల తర్వాత కీలకమైన ఉద్యోగిగా ఆఫీస్ సూపరింటెండెంట్ వ్యవహరిస్తారు. మూడేళ్లుగా ఈ పదవిలో కొనసాగుతున్న సయ్యద్ అక్బర్ అలీ ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ట్యాక్స్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్న యానీకి పదోన్నతి కల్పించనున్నారు. ఇక బోర్డులో 90 శాతం ఉద్యోగులతో అతిపెద్ద విభాగంగా కొనసాగుతున్న హెల్త్ విభాగం సూపరింటెండెంట్ అఫ్జల్ మోహియుద్దీన్ ఫిబ్రవరిలో పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న ఎం. దేవేందర్‌ను హెల్త్ సూపరింటెండెంట్‌గా నియమించనున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ నూతన ఎస్‌డబ్ల్యూఎం సూపరింటెండెంట్ కానున్నారు. శుక్రవారం నాటి బోర్డు సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించనున్నారు. ఇక మార్చి నెలలో కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ (సీసీపీ) బాలకృష్ణ, కంటోన్మెంట్ ఇంజనీర్ (సీఈ) గోపాల కృష్ణ కూడా పదవీ విరమణ పొందనున్నారు.

హెల్త్ విభాగానికి తొలి పోస్ట్ గ్రాడ్యుయేట్



దేవేందర్

కంటోన్మెంట్‌లో ఉద్యోగుల నియామకాలకు సైతం నాటి నిబంధనలనే పాటిస్తూ వచ్చారు. కీలకమైన విభాగాల ఉన్నతాధికారులు సైతం కేవలం పదో తరగతి కనీస విద్యార్హత కలిగి ఉండేవారు. నిబంధనల మేరకు ఇప్పటికీ బోర్డులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కూడా లేరు. గతంలో హెల్త్ సూపరింటెండెంట్‌లుగా వ్యవహరించిన వారికి ఇందుకు సంబంధించిన అర్హతలు కూడా లేనందున ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను సైతం నియమించలేదు. తాజాగా హెల్త్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్న ఎం.దేవేందర్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశారు. దీంతో హెల్త్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్న తొలి పోస్ట్ గ్రాడ్యుయేట్ కానున్నారు.

వ్యక్తికి రెండ్రోజుల జైలు



సూర్యనారాయణ

లాలాపేట: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి రెండ్రోజుల జైలుశిక్ష విధించిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. ఇటీవల హబ్సిగూడ ప్రాంతంలో నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ పేరుతో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లను తొలగిస్తుండగా పుల్లగూర సూర్యనారాయణ(30) అనే వ్యక్తి ట్రాఫిక్ పోలీసుల విధులకు అడ్డుతగలడంతో ఈ–పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశ పెట్టగా గురువారం నాంపల్లి 8వ ఎంఎం కోర్టు జడ్జి పద్మజ జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



కుమ్మరి బస్తీలో పర్యటిస్తున్న తలసాని

అమీర్‌పేట: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. గురువారం అమీర్‌పేట డివిజన్ కుమ్మరి బస్తీలో వివిధ శాఖ అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుమ్మరిబస్తీలో మంజూరైన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల విలువైన పనులను ప్రారంభించడం జరిగిందని కొన్ని పనులు పూర్తి కాగా ఎన్నికల కోడ్ రావడంతో మరి కొన్ని పనులు నిలిచిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందిర, డీఈ మోహన్, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఎఎమ్‌హెచ్‌వో ప్రవీణ, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి ఉన్నారు.

త్వరలో చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి



పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈవో మధుకర్

రసూల్‌పురా: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అన్నానగర్ చిల్డ్రన్స్‌పార్క్ అభివృద్ధి పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు రెండున్నర ఎకరాల స్థలంలో మట్టి దిబ్బలు, రాళ్లు, పిచ్చి మొక్కలతో నిండి ఉండి మందుబాబులకు అడ్డాగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతం త్వరలో ప్రజలకు ఉపయోగపడేలా పార్క్‌గా అందుబాటులోకి రానుంది. గురువారం కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, బోర్డు ఇంజినీరింగ్ అధికారి ఉమాశంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్ ఇతర అధికారులు పార్క్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్, మహేందర్ మాట్లాడుతూ.. గతంలో ఈ స్థలంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డును తొలగించిన పార్కుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని, కొన్ని కారణాలతో పనులు నిలిచిపోయాయన్నారు. ప్రస్తుత సీఈవో మధుకర్ నాయక్ ప్రత్యేక దృష్టి సారించి బోర్డు నిధులతో పాటు దాతల సహకారంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశుతోష్, దఫేదార్లు రాజేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నేత నరేంద్ర మోదీ



బోర్‌బావిని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అమలుచేస్తూ దేశం గర్వించదగ్గ నేతగా యావత్ భారతావని ప్రశంసలు అందుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బేగంపేట ఓల్డ్ పాటిగడ్డలో ఎంపీ లాడ్స్‌తో నిర్మించిన బోర్‌బావిని గురువారం ఆయన ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలకు తాను నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కరిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు చీర సుచిత్ర, దీపిక పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

సికింద్రాబాద్: ఉమామహేశ్వరరావుకు వైద్య మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం ఎమ్మెల్యే పద్మారావు అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

లాలాపేట: అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని లాలాపేట ఆర్యవైశ్య సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు నేతి రాములు గుప్తా పేర్కొన్నారు. గురువారం లాలాపేట ప్రొ. జయశంకర్ స్టేడియం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ గుప్తా, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్ గుప్తా పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో..

రసూల్‌పురా: అమావాస్య సందర్భంగా బొల్లారం సదర్‌బజార్ మహంకాళి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం, చండీ హోమం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెలనాగేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటంకం లేకుండా సివరేజీ పైపులైన్ పనులు

చిలకలగూడ: చిలకలగూడ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యలు, వాహనదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా సివరేజీ పైపులైన్ పనులు చేపట్టేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. సీతాఫల్‌మండి డబుల్ ఇళ్ల సముదాయం నుంచి జోషి కాంపౌండ్ వరకు సివరేజీ పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 38 లక్షలు మంజూరయ్యాయి. ప్రధాన రహదారిపై నుంచి సివరేజీ పైపులైన్ కొనసాగుతుంది. గురువారం కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో ప్రాజెక్ట్ మేనేజర్ మనోహర్, జలమండలి సెక్షన్ మేనేజర్ అన్వీత్‌తో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మరో రెండు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభిస్తారని, ట్రాఫిక్‌తో పాటు వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్మాణ పనులు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు.

చీఫ్ ఇంజినీర్‌తో సమావేశం..

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్‌తో గురువారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సమావేశమయ్యారు. డివిజన్‌లో ప్రతిపాదిత అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, నిధులు మంజూరై ఉన్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయించాలని హేమ కోరారు.